క్లుప్తంగా

సమస్యల పరిష్కారానికి చర్యలు



కంకిపాడు: సమస్యల పరిష్కారానికి సమర్థంగా చర్యలు తీసుకుంటున్నట్లు తహసీల్దార్ వి.భావనారాయణ తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక 'మీకోసం' కార్యక్రమం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. వివిధ శాఖలకు చెందిన అధికారులు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. తహసీల్దార్ మాట్లాడుతూ మీ కోసంలో సమర్పించిన అర్జీలను పూర్తి స్థాయిలో పరిష్కరించడమే లక్ష్యమని పేర్కొన్నారు. సమావేశంలో ఎంపీడీఓ పి.అనూష, అదనపు ఎస్‌ఐ తాతాచార్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

కంప్యూటరుపై అవగాహన పెంచుకోవాలి

ఉయ్యూరు: కంప్యూటరుపై పరిజ్ఞానాన్ని పెంచుకోవాలని ఏజీ అండ్ ఎస్‌జీ సిద్దార్థ కళాశాల ప్రత్యేకాధికారి సత్యనారాయణ అన్నారు. ప్రపంచ కంప్యూటరు అక్షరాస్యతా దినోత్సవాన్ని కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. కంప్యూటరు జనరేషన్, పురాతన హార్డ్‌వేర్, ఉపకరణాలను ప్రదర్శించారు. కంప్యూటరు పరిజ్ఞానంపై క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శివనాథ్, అధ్యాపకులు అనిల్‌కుమార్, ప్రభావతి పాల్గొన్నారు.

సన్నబియ్యం పంపిణీ చేయాలి

కంకిపాడు: అన్ని వర్గాల ప్రజలూ తినేందుకు వీలైన సన్నబియ్యం పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సీహెచ్‌సీ మాజీ చైర్మన్ యలమంచిలి కిషోర్‌బాబు అన్నారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. కిలో రూ. రెండు బియ్యం పంపిణీ పథకాన్ని ఆ నాడు ఎన్టీఆర్ ప్రవేశపెట్టారన్నారు. లక్షలాది మంది ప్రజలకు సబ్సిడీపై రేషన్ బియ్యం పంపిణీ అవుతుందన్నారు. ప్రస్తుతం ఈ బియ్యం అక్రమార్కుల వ్యాపార అవసరాలకు మాత్రమే వినియోగం అవుతోందన్నారు. అన్ని వర్గాల ప్రజలు తినేందుకు వీలైన సన్న బియ్యం పంపిణీ చేసి ప్రజలకు ధరల భారం నుంచి ఉపశమనం కలిగించాలని విజ్ఞప్తిచేశారు.

ఘనంగా పునీత ఫ్రాన్సిస్ శౌరి ఉత్సవాలు

అజ్జంపూడి(గన్నవరం): మండలంలోని అజ్జంపూడిలో పునీత ఫ్రాన్సిస్ శౌరివారి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో రెండవ రోజైన సోమవారం ఉదయం దివ్యబలిపూజ నిర్వహించారు. అనంతరం జపమాల, రెవరెండ్ ఫాదర్ దగాని జేవియర్ ఆధ్వర్యంలో దివ్య సత్ప్రసాద ఆరాధనలు, స్వస్థత ప్రార్థనలు జరిపారు. సాయంత్రం చనుబండ విచారణ గాయక బృందంచే ఆలపించిన గీతాలు, ఏసోబు చరిత్రపై బుర్రకథ భక్తులను ఆకట్టుకున్నాయి. రెవరెండ్ ఫాదర్లు కె. మరియో, మరియజోజి, విల్సన్, రాయప్ప కొప్పుల పాల్గొన్నారు.

అన్నదాత గోడు పట్టని సర్కారు

- ఇంకా రోడ్ల మీదే ధాన్యం రాసులు
- రవాణా, హమాలీ చార్జీల భారం
- కొనసాగుతున్న తుపాను ప్రభావం

కంకిపాడు/గన్నవరం: 'రైతుకు మేలు చేయడమే ప్రభుత్వ లక్ష్యం. రైతు పండించిన ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం. మద్దతు ధర దక్కేలా అన్నదాతకు అండగా నిలుస్తాం. అన్ని విధాలా రైతు సంక్షేమానికే చర్యలు' అని సాక్షాత్తూ రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఖరీఫ్ ధాన్యం సేకరణ ప్రారంభానికి ముందు పునాదిపాడు పర్యటన సందర్భంగా వెల్లడించారు. కానీ ప్రస్తుత ధాన్యం సేకరణ తీరు చూస్తే అన్నదాతలకు అగచాట్లు, అవస్థలు తప్ప సంక్షేమం కానరావడం లేదు. తమ గోడును అటు పాలకులు, ఇటు అధికారులు ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదంటూ రైతులు వాపోతున్నారు.



కంకిపాడు బైపాస్‌లో హడావిడిగా ధాన్యం నెట్టి వేస్తున్న కూలీలు

అధికారుల తాత్సారం

పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా చాలా గ్రామాల్లో కోత కోసిన ధాన్యం మిల్లులకు తరలించకుండా ఇంకా రోడ్లమీదే కనిపిస్తోంది. ఉయ్యూరులో వెయ్యి మెట్రిక్ టన్నులు, పెనమలూరులో 4,034, కంకిపాడులో ఏడువేల మెట్రిక్ టన్నుల ధాన్యం మిల్లులకు తరలించాల్సి ఉంది. అలాగే గన్నవరం నియోజకవర్గంలోని గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు, విజయవాడ రూరల్ మండలాల పరిధిలో సుమారు 68 వేల ఎకరాల్లో వరిసాగు చేశారు. ఇప్పటి వరకు సుమారు పది వేల ఎకరాల్లో వరికోతలు జరిగాయి. అయితే నాలుగు మండలాల్లోనూ రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు నామమాత్రంగానే జరుగుతున్నాయి. ప్రస్తుతం ధాన్యం రోడ్లు, కల్లాల్లో రాసులు, బస్తాల్లో ఉంచారు. ఇటీవల మంత్రి మనోహర్ నియోజకవర్గ పర్యటనతో రోడ్లపై ఉన్న ధాన్యాన్ని హుటాహుటిన తరలించిన అధికార యంత్రాంగం ప్రస్తుతం నెమ్మదించారు. గోనె సంచులు లభ్యత ఉన్నా ఇంకా రవాణా సదుపాయం మెరుగుపడలేదు. వాహనాలు సమకూర్చడంలో అధికారులు తాత్సారం చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నిబంధనల కొర్రీతో అవస్థలు

ధాన్యం సేకరణలో నిబంధనల కొర్రీతో రైతులు అవస్థలు పడుతున్నారు. గతేడాది ఎంతో వేగంగా సేకరించిన 1262 రకం విత్తన ధాన్యం ఈ ఏడాది నూక అవుతుందనే సాకుతో మిల్లర్లు తీసుకునేందుకు మోకాలడ్డారు. మంత్రి సమక్షంలో సమస్య విన్నవించినా చాలా గ్రామాల్లో ఇంకా రాసులు, బస్తాల మీదే 1262 ధాన్యం ఉండిపోయింది. మిల్లులకు తరలించినా దిగుమతి చేసుకోకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న పరిస్థితి నెలకొంది. తుపాను ప్రభావంతో వీస్తున్న చలిగాలులు, చెదురుమదురు జల్లులతో ధాన్యం తేమ పూర్తి స్థాయిలో తగ్గడం లేదు. ధాన్యం బూజు పట్టి, నాణ్యత దెబ్బతినకుండా త్వరితగతిన ధాన్యం సేకరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



బుద్ధవరంలో రోడ్డుపై ఉన్న ధాన్యం రాసులు

రైతులపై మోయలేని భారం

ఎకరాకు ఒక్కో రైతు రూ. 35 వేలు వరకూ పెట్టుబడులు పెట్టి సాగు చేశారు. కౌలురైతులు అదనంగా 20 బస్తాల వరకూ కౌలు చెల్లించాల్సి ఉంది. అయితే చేతికొచ్చిన పంట కాటా వేసి మిల్లుకు తరలించేందుకు హమాలీ ఖర్చులు కూడా రైతులే భరించాల్సి వస్తోంది. టిక్కీకి (40 కిలోల బస్తా) రూ. 18 చొప్పున ముఠా కూలీ వసూలు చేస్తున్నారు. రైతులు ప్రైవేటు వాహనాలను అధికారుల సమక్షంలో సమకూర్చుకున్నా టన్నుకు రూ. 550 చొప్పున చెల్లించి మిల్లుకు తరలించాల్సి వస్తుంది. దీని వల్ల ముఠాకు ఎకరాకు రూ. 1,500 వరకూ, రవాణాకు రూ. 5 వేలు వరకూ ఖర్చు అవుతోందని అన్నదాతలు వాపోతున్నారు. 75 కిలోల బస్తాకు మద్దతు ధర ఏ-గ్రేడు రూ. 1,740, కామన్ వెరైటీ రూ. 1,725 ఉండగా, రైతుకి మాత్రం రూ. 1,400 మించి పలకడం లేదంటూ ఆందోళన వెలిబుచ్చుతున్నారు.

వీడని ఫెంగల్ బెంగ

పెనమలూరు నియోజకవర్గంలో ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో 34,977 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ప్రధానంగా ఎంటీయూ 1061, 1262, 1318, బీపీటీ మొదలైన సన్న రకాలను రైతులు సాగు చేశారు. నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ 15 రోజులుగా సాగుతోంది. ఇప్పటి వరకూ పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో 18,065 మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు అధికారుల లెక్కలు చెబుతున్నాయి. ఫెంగల్ తుపాను బెంగతో ఆరుగాలం కష్టించి పండించిన పంట ఎక్కడ చేతికి అందకుండా పోతుందోనన్న భయం రైతులను గత మూడు రోజులుగా వెంటాడుతోంది. వాతావరణం పూర్తిగా మబ్బులు కమ్మింది. గడిచిన రెండు రోజులు మోస్తరు వర్షం కురిసినా.. సోమవారం మాత్రం చిరుజల్లులే పడ్డాయి. వర్షం తీవ్రత పెరిగి పంట నేలవాలి నష్టపోవాల్సి వస్తుందేమోనన్న భయంతో రైతులు యంత్రాలతో కోతకోయించి ధాన్యం రోడ్లపైకి చేర్చి రాసులు పోసుకున్నారు.

ఎవ్వరూ పట్టించుకోలేదు



ఐదెకరాల్లో 1262 విత్తనం సాగు చేశాను. వారం క్రితం కోత కోసి కాటా వేసి మిల్లుకు తోలాను. ఐదు రోజులు అక్కడే ఉంచుకుని ఇప్పుడు వద్దని చెబుతున్నారు. అధికారుల దృష్టికి సమస్య తీసుకెళ్లినా పరిష్కారం కాలేదు. పంట డబ్బులు చేతికి ఎలా వస్తాయో అర్థం కావడం లేదు. ఎవ్వరూ పట్టించుకోలేదు.

–గద్దం రాజా, కౌలురైతు, గొడవర్రు

తక్కువ ధరకే కొనుగోలు



ఎకరానికి రూ. 35వేలు వెచ్చించి 15 ఎకరాలు కౌలు చేశాను. పంట కోతకు రావడంతో తుఫాన్ కారణంగా యంత్రంతో కోతలు పూర్తి చేశాను. ధాన్యం సేకరణకు రైతు సేవా కేంద్రాల్లో గోనె సంచులు అందుబాటులో లేవు. మధ్యవర్తుల ద్వారా మిల్లర్లు సంచులు సమకూర్చారు. తుఫాన్ బూచిని చూపించి 75కిలోల బస్తాకు మద్దతు ధర రూ. 1,725 ఉండగా దళారులు రూ. 1,450కే కొనుగోలు చేశారు.

–డి.వెంకటేశ్వరరావు, కౌలు రైతు, తేలప్రోలు

అధ్యాపకులు నైపుణ్యం పెంచుకోవాలి



పెనమలూరు: ఇంజినీరింగ్ కాలేజీలో అధ్యాపకులు నైపుణ్యం పెంపొందించుకుని నాణ్యమైన బోధన చేయాలని ఆంధ్రప్రదేశ్ డ్రోన్ కార్పొరేషన్(ఏపీడీసీ) చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.దినేష్‌కుమార్ అన్నారు. గంగూరు ధనేకుల ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం ఈసీఈ డిపార్టుమెంట్, ద్రోణాచార్య టెక్ హబ్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 12 రోజులపాటు జరగనున్న ఏ12-డే అడ్వాన్స్‌డ్ ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఏపీ ప్రభుత్వం డ్రోన్‌ల అభివృద్ధికి స్టార్టప్‌కు రూ. 5 లక్షల నిధులు, డ్రోన్స్ తయారీదారులకు 20 శాతం సబ్సిడీ తెలిపారు. అనంతరం దినేష్‌కుమార్‌ను నిర్వాహకులు ఆత్మీయంగా సన్మానించారు. కార్యక్రమంలో కాలేజీ డైరెక్టర్ రవి ప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కడియాల రవి, ఇంజినీరింగ్ నిపుణులు ఐఐటీ గౌహతి ప్రొఫెసర్ డాక్టర్ ప్రదీప్ కెదాస్, పలు యూనివర్సిటీల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన



గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద జెడ్పీ హైస్కూల్‌లో సోమవారం ఎస్‌ఆర్‌ఎం యూనివర్సిటీ ఫోర్ స్కూల్ ఆఫ్ బిజినెస్ పీజీ విద్యార్థులు హైస్కూల్ విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. పాఠశాల స్థాయిలో ఉత్తమంగా చదివి ఎదగాలని సూచించారు. హెచ్‌ఎం శ్రీపతి రామ్‌గోపాల్ మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచంలో పీజీ విద్యార్థులు పాఠశాల స్థాయిలో విద్యార్థులకు గురువులుగా మారి భవిష్యత్‌పై అవగాహన కల్పించడం అభినందనీయమని అన్నారు. శశాంక్ చౌదరి ఆధ్వర్యంలో హితేష్ పాత్రో, గౌరీ శంకర్, సోమశేఖర్, రఫియా షేక్, బిలియంత్ గుమిడి తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తికమాస ఉద్వాసన పూజలు

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సమేత శ్రీ రామలింగేశ్వర స్వామివారి దేవస్థానంలో సోమవారం కార్తికమాస ఉద్వాసన విశేష పూజలు భక్తిశ్రద్ధలతో చేశారు. కార్తికమాస ఉద్వాసన సందర్భంగా స్వామివారిని విశేషంగా అలంకరించారు. కార్తికమాసం నెలరోజులు పరోక్ష అభిషేకం చేయించుకున్న భక్తులకు ఆలయ నిర్మాణదాత నూతన వస్త్రాలు, ఆలయ క్యాలెండర్, ప్రత్యేక ప్రసాదం అందజేశారు. సాయంత్రం ప్రదోషకాలంలో స్వామివారికి అభిషేకం, అర్చన చేశారు. స్వామివారికి పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓ ఎస్.భవాని, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



యనమలకుదురులో ప్రత్యేక అలంకరణలో శ్రీరామలింగేశ్వరస్వామి

ముగిసిన కార్తిక పూజలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం రామవరప్పాడు శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయంలో గత నెల రోజులుగా జరుగుతున్న కార్తిక మాస పూజలు సోమవారంతో ముగిశాయి. ఆలయ ప్రాంగణంలోని ఉప ఆలయమైన శ్రీ గంగా పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్లకు విశేష అభిషేకాలు, పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివార్లను దర్శించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో దీపారాధనలు చేసి పోలి స్వర్గం చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ పి. ప్రియాంక పాల్గొన్నారు.

కంకిపాడు: కార్తిక మాసం ముగింపు సందర్భంగా ఆఖరి సోమవారం భక్తిప్రపత్తులతో కార్తిక పూజలు నిర్వహించారు. మండలంలోని అన్ని శైవక్షేత్రాల్లో తెల్లవారుజాము నుంచే విశేష పూజలు, అభిషేకాలు జరిపించారు. మద్దూరు, కాసరనేనివారిపాలెం పరిధిలోని కృష్ణానది ఏటిపాయ, కాలువల్లో భక్తులు అరటిడొప్పల్లో కార్తిక దీపాలు ఉంచి ఏటిపాయలో పోలెమ్మను స్వర్గానికి పంపారు. వేలాది మంది భక్తజనం ఏటిపాయకు తరలివచ్చి విశేష పూజలు జరిపించారు.



రామవరప్పాడులో దీపారాధన చేస్తున్న మహిళలు



మద్దూరు పుష్కరఘాట్‌లో పూజలు చేస్తున్న భక్తజనం



మద్దూరు ఏటిపాయిలో పోలిని సాగనంపుతున్న భక్తులు

విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలపై ప్రత్యేక శ్రద్ధ

గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థి పట్ల ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ టి. స్వర్ణలత సూచించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో సోమవారం విద్యార్థులకు పంపిణీ చేసేందుకుగాను సమగ్ర ప్రగతి పత్రాలను ఆమె చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. సమగ్ర ప్రగతి పత్రంలో విద్యార్థుల పరీక్షల ఉత్తీర్ణత, హాజరుతో పాటు ఆరోగ్య పరిస్థితి వంటి వివరాలను తెలియజేయడం మంచి విషయమన్నారు. దీనివల్ల విద్యార్థుల విద్యాభ్యసన సామర్థ్యాలు, ఆరోగ్య సమాచారం, తరగతి హాజరు తల్లిదండ్రులకు కూడా తెలియజేయవచ్చని చెప్పారు. రాష్ట్ర సమగ్రశిక్ష నుంచి వచ్చిన ప్రగతి పత్రాలను అన్ని పాఠశాలల్లో పంపిణీ చేయనున్నట్లు ఎంఈఓ-1 కొండా రవికుమార్ తెలిపారు. ఎంఈఓ-2 కమల, పలువురు ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.



సమగ్ర ప్రగతి పత్రాలను అందజేస్తున్న ఎంపీడీఓ

ప్రభుత్వ పాఠశాలల్లో ఆయాలకు జీతాలు చెల్లించండి

పెనమలూరు: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఆయాలకు వెంటనే జీతాలు చెల్లించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి డిమాండ్ చేశారు. పెనమలూరులో సోమవారం మండల విద్యాశాఖ అధికారులకు ఆయాలతో కలిసి వినతిపత్రం అందజేసి వివరాలు తెలిపారు. మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న దాదాపు 50 మంది ఆయాలకు ప్రభుత్వం గత ఐదు నెలలుగా జీతాలు చెల్లించలేదన్నారు. ఆయాలకు నెలకు రూ. ఆరు వేలు జీతాలు ఇవ్వాల్సి ఉండగా ప్రభుత్వం వారి పట్ల నిర్లక్ష్యం చూపుతోందన్నారు. జీతాలు లేక ఆయాలు అప్పుల పాలయ్యారన్నారు. 300 మంది విద్యార్థులకు ఒక ఆయాను నియమించడం వల్ల పని భారం విపరీతంగా పెరిగిందని తెలిపారు. 50 మంది విద్యార్థులకు ఒక ఆయాను ఉంచే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయాలకు ప్రతి నెలా ఐదవ తేదీ నాటికి జీతాలు ఇవ్వాలని, గుర్తింపు కార్డులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాద బీమా అమలు చేయాలని, అలాగే చేతి గ్లౌజ్‌లు, మాస్కులు, ఇతర శానిటరీ సామగ్రి ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘ నేతలు విశ్వనాథపల్లి సుజాత, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఎయిడ్స్‌పై అవగాహన

ఉయ్యూరు: ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీడీఓ జీఎస్‌వీ శేషగిరిరావు అన్నారు. మండలంలోని ఆకునూరు ప్రభుత్వ పాఠశాలలో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపీడీఓ శేషగిరిరావు మాట్లాడుతూ ఎయిడ్స్ మహమ్మారిపై ప్రతి ఒక్కరూ అవగాహనతో నడవాలన్నారు. టేక్ ది రైట్ పాత్ అనే నినాదంతో ప్రపంచ వ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సలోమి, చిన ఓగిరాల పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వరి కోతలకు దిగిన రైతులు



తాడిగడపలో వరి కోతలు కోస్తున్న యంత్రం



ధాన్యాన్ని ట్రాక్టర్‌లో బయటకు తరలించడానికి లోడ్ చేస్తున్న దృశ్యం

పెనమలూరు: వరికోతలకు రైతులు ఉపక్రమించారు. గత మూడు రోజులుగా తుపాను కారణంగా బిక్కుబిక్కుమన్న రైతులు ఊపిరి పీల్చుకుని రంగంలోకి దిగారు. అయితే ధాన్యం మిల్లులకు తరలించడానికి లారీల కొరత ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండల పరిధిలో దాదాపు 5,500 ఎకరాల్లో సార్వ వరి సాగు జరిగింది. ఇప్పటివరకు 2,255 ఎకరాల్లో వరి కోతలు కోశారు. అయితే రవాణా సదుపాయం లేకపోవడంతో కేవలం 1,885 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే తరలించగా మరో నాలుగు వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కల్లాలోనే ఉండిపోయింది. ఈలోగా తుపాను రావడంతో రైతులు ఉరుకులు పరుగులు తీసి ధాన్యం రాసులను టార్పాన్లతో కప్పి కాపాడుకున్నారు. రైతుల అదృష్టం బాగుండి పంటకు ఎక్కువ నష్టం జరగలేదు. దీంతో రైతులు సోమవారం పంట పొలాల్లో ఉన్న వరిని యంత్రాలతో కోయడం ప్రారంభించారు. రైతులు సాధ్యమైనంత త్వరగా వరి కోతలు ముగించడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే అధికార యంత్రాంగం నుంచి సహకారం అందడంలేదు.

దిక్కుతోచని స్థితిలో రైతులు

రైతుల ధాన్యం వెంటనే తరలిస్తామని ప్రభుత్వం, అధికారులు ప్రకటనలు చేస్తున్నా ఆచరణలో మాత్రం అది కనబడటం లేదు. ఇంకా దాదాపు 3,500 ఎకరాల వరి కోతలు జరగాల్సి ఉంది. ఈ పరిస్థితుల్లో రైతులు ఏమి చేయాలో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వం పొలాల్లో ఉన్న ధాన్యం తరలించడానికి సకాలంలో రవాణా సదుపాయం కల్పించి, మిల్లర్ల వద్ద మద్దతు ధర రైతులకు ఇస్తే కానీ రైతులు కష్టాల నుంచి గట్టెక్కే పరిస్థితి లేదు.

పేకాట, కోడి పందేలు ఆడుతున్న 15 మంది జూదరుల అరెస్ట్

గన్నవరం: మండలంలోని వేర్వేరు గ్రామాల్లో జరుగుతున్న జూద శిబిరాలపై సోమవారం పోలీసులు దాడులు చేసి 15 మందిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం ... కొండపావులూరు శివారు ఆర్‌ఎస్. నెం ఆరులోని కొండగట్టు ప్రాంతంలో గుట్టుచప్పుడు కాకుండా పేకాట శిబిరం నడుపుతున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ శివప్రసాద్ నేతృత్వంలో సిబ్బంది దాడిచేసి ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 5,460 నగదు స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా జక్కులనెక్కలం గ్రామ పరిధిలోని ఏలూరు కాలువ గట్టుపై కోడి పందేలు నిర్వహిస్తున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. జూదరుల నుంచి రూ. 10,700 నగదు, ఏడు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

సైబర్ నేరగాళ్ల కొత్త పంథా

హనుమాన్‌జంక్షన్ రూరల్: అమాయకుల నుంచి సొమ్ము కాజేసేందుకు సైబర్ నేరగాళ్లు కొత్త పంథాను ఎంచుకున్నారు. విదేశాల్లో ఉన్నత చదువులు, ఉద్యోగాలు చేస్తున్న వ్యక్తుల సమాచారాన్ని సేకరించి, వారి కుటుంబ సభ్యులను టార్గెట్‌గా చేసుకుంటున్నారు. తాజాగా ఇలాంటి సంఘటనే హనుమాన్‌జంక్షన్‌లో సోమవారం చోటు చేసుకుంది. స్థానిక గుడివాడరోడ్డుకు చెందిన బోయపాటి ప్రసాద్ తనయుడు ఆస్ట్రేలియాలో ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో అజ్ఞాత వ్యక్తి నుంచి బోయపాటి ప్రసాద్‌కు వాట్సాప్ కాల్ వచ్చింది. 'ఆస్ట్రేలియా పోలీస్ డిపార్ట్‌మెంట్ నుంచి మాట్లాడుతున్నాం.. మీ అబ్బాయిని అరెస్ట్ చేశాం.. తక్షణమే రూ. 50 వేలు తమ ఖాతాకు ట్రాన్స్‌ఫర్ చేయండి' అంటూ ఇంగ్లీష్‌లో హెచ్చరిస్తున్నట్లుగా మాట్లాడారు. అంతేకాక తన కుమారుడి వివరాలు అన్ని కరెక్ట్‌గా చెప్పారు. దీంతో ఒక్కసారిగా భయాందోళనకు గురైన ప్రసాద్ తన స్నేహితులకు ఈ విషయాన్ని చెప్పాడు. అదే సమయంలో తన కుమారుడి ఫోన్ నంబర్‌కు ఎన్నిసార్లు కాల్ చేసినా స్పందించకపోవడంతో ఆయన మరింత కంగారుపడ్డారు. కానీ స్నేహితుల సలహాతో కొద్దిసేపటికి తేరుకున్నాడు. ఆస్ట్రేలియా పోలీసులు ఫోన్ చేసి మరీ తనను లంచం అగడటం ఏమిటి? అనే అనుమానం వచ్చింది. డబ్బులు పంపాలని సైబర్ నేరగాళ్లు పదేపదే వాట్సాప్ కాల్ చేస్తుండటం కూడా అనుమానానికి మరో కారణమైంది. కొద్దిసేపటికి తన కుమారుడికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని పూర్తిగా వివరించాడు. ఇది సైబర్ నేరగాళ్ల పనేనని, తాను ఆస్ట్రేలియాలో క్షేమంగా ఉన్నానని కుమారుడు చెప్పడంతో ప్రసాద్ ఊపిరి పీల్చుకున్నారు.